క్లుప్తంగా

ఎంఎంఎస్ నూతన కమిటీ ఎన్నిక

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలుగా పప్పుల బాలమ్మ ఎంపికయ్యారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బాలమ్మను అధ్యక్షురాలిగా ఎన్నుకోగా, అందరు సభ్యులు తమ ఆమోదం తెలిపినట్టు వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆదినారాయణ తెలిపారు. అలాగే ఉపాధ్యక్షురాలిగా పప్పుల పైడమ్మ, కార్యదర్శిగా సాగిన దేవి, కోశాధికారిగా కోసూరి లక్ష్మి ఎంపికైనట్టు చెప్పారు.

దసరా ఉత్సవాలకు ముహూర్తపు రాట

జి.మాడుగుల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం జంక్షన్ వద్ద శ్రీదేవి శరన్నవరాత్రి దసరా ఉత్సవాల ఏర్పాటుకు శుక్రవారం ఉత్సవ కమిటీ సభ్యులు, ముహూర్తపు రాటను వేశారు. దసరా ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం



బస్టాండు ఆవరణను పరిశుభ్రం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ సిబ్బంది

వై.రామవరం: స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాల్లో మండల కేంద్రంలో సీఆర్‌పీఎఫ్ డి–42 బెటాలియన్ అదనపు బలగాల పోలీసుల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించారు. గ్రామంలోని బస్టాండు, రోడ్లు, ఆస్పత్రి, పోలీసు స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రం చేశారు.

ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ



రాజవొమ్మంగి ఎస్‌ఐ నరసింహమూర్తి



జడ్డంగి ఎస్‌ఐ చిన్నబాబు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి సర్కిల్ పరిధిలోని రాజవొమ్మంగి, జడ్డంగి స్టేషన్లకు ఎస్‌ఐలుగా ఈ.ఎల్.నరసింహమూర్తి, బి.చిన్నబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయా ప్రాంతాల్లో పనిచేసిన ఎస్‌ఐలు వెంకయ్యకు పాడేరు ఎస్‌బీ ఎస్‌ఐగా, రఘునాథరావు జగ్గంపేట బదిలీ అయ్యారు.


త్రుటిలో తప్పిన ప్రమాదం



గాంధీనగర్ ఆశ్రమ పాఠశాల వద్ద పాకలోనికి దూసుకెళ్లిన వాహనం

జి.మాడుగుల: చింతపల్లి వెళ్లే మార్గంలో గాంధీనగర్ బాలిక ఆశ్రమోన్నత పాఠశాల సమీపంలో శుక్రవారం ఓ వాహనం ప్రమాదానికి గురైంది. పాడేరు నుంచి చింతపల్లి వైపు వెళ్తున్న వాహనం అదుపుతప్పి బాలికల ఆశ్రమోన్నత పాఠశాల ఎదురుగా ఉన్న పాకలోనికి వాహనం దూసుకెళ్లింది. ఈ సంఘటనలో పాక పూర్తిగా ధ్వంసమైంది. కారులో ఇద్దరు వ్యక్తులు ప్రయాణిస్తున్నట్టు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేనట్టు తెలిసింది.

అర్హులకు పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ రకాలైన సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అమలు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా మండలంలోని మడిచర్ల గ్రామంలో రచ్చబండ నిర్వహించారు. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రయోజనాల కోసం త్యాగం చేసిన పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు కూటమి సర్కారు నుంచి భరోసా కరువైంది. అధికారం చేపట్టి వందరోజులు గడుస్తున్నా క్యాబినెట్ సమావేశంలో వారి సమస్యలపై ప్రస్తావించలేదు సరికదా కనీసం వారి కోసం తీసుకున్న చర్యలపై ఎటువంటి ప్రకటన చేయలేదు. ఇలాంటి పరిస్థితుల్లో 'ఇది మంచి ప్రభుత్వం' అని చెప్పుకునేందుకు తమ వద్దకు ఎలా వస్తారని పోలవరం ప్రాజెక్ట్ బాధిత ప్రాంతాల ప్రజలు ధ్వజమెత్తుతున్నారు.

ఇది దగా ప్రభుత్వం



రంపచోడవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా ప్రధాన సమస్యలను పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. దీంతో పాటు ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. తమ సమస్య పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపుతుందని పోలవరం నిర్వాసితులు ఎంతో ఆశపడ్డారు. అధికారం చేపట్టిన వంద రోజుల్లో ఈ సమస్యను కూటమి ప్రభుత్వం గుర్తించకపోవడం బాధిత ప్రాంతాల ప్రజలను నిరాశకు గురి చేసింది.

- రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాల్లో ఐదు మండలాలు పోలవరం ప్రాజెక్టు ముంపులో ఉన్నాయి. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, విలీన మండలాల్లో కాలనీలకు స్థల సేకరణ, భూమికి భూమి, ఆ భూమి పరిహారం, 18 ఏళ్ల ప్యాకేజీ వంటి సమస్యలు నిర్వాసితులను వెంటాడుతున్నాయి. కేవలం పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై మాట్లాడిన ప్రభుత్వం నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించలేదు.
- ఏటా సంభవించే గోదావరి, శబరి వరదలు విలీన మండలాలైన కూనవరం, వీఆర్ పురం, చింతూరు, ఎటపాక ప్రాంతాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గతంలో వరదలు సంభవించినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులను ఓదార్చారు. ఈ ఏడాది రెండు సార్లు ముంచెత్తడంతో ఆస్తి నష్టం సంభవించింది. కూటమి ప్రభుత్వం కనీసం సహాయక చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని ముంపు ప్రాంత బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కష్టాల్లో ముందుండటం ఇలాగేనా?

ప్రజల కష్టాలను తీర్చడంలో ముందుంటానని చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు కనీసం ముంపు ప్రాంతాల్లో పర్యటించలేదు. ఆయన వస్తే సమస్యకు మోక్షం లభిస్తుందని ఆశపడిన బాధితులకు భరోసా లేకుండా పోయింది. వరదలను ఎదర్కొనలేకపోతున్నామని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, భూమికి పరిహారం ఇస్తే ఇక్కడి నుంచి వెళ్లిపోతామని ఈ ప్రాంతానికి వచ్చిన జాయింట్ కలెక్టర్‌ను ముంపు ప్రాంతాల ప్రజలు వేడుకోవడం వారి దయనీయ పరిస్థితికి అద్దం పడుతోంది. అధికార పార్టీ నేతలు కూడా ఈ సమస్యపై దృష్టిపెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

- సూపర్ సిక్స్ పథకాలతో పేదల ఆర్థిక పరిస్థితి మారిపోతుందని సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు ఊదరకొట్టారు. అధికారం చేపట్టి వంద రోజులు గడుస్తున్నా అవి అమలుకు నోచకోలేదు. దీంతో చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలను నమ్మి మరోసారి మోసపోయామని మదన పడుతున్నారు.

హామీల అమలు ఎప్పుడు?



కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీతో అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతున్నా వాటిని అమలు చేసేందుకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. కేవలం అధికారం కోసమే సూపర్ సిక్స్ ప్రకటన చేసి ప్రజలను మోసం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం ఉచిత గ్యాస్, అమ్మకు వందనం, నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో ఖచ్చితంగా చెప్పాలి. అధికారం కోసం అబద్ధాలు చెప్పడం వారికి అలవాటే.

– పండా రామకృష్ణదొర, పందిరిమామిడి

నిరుద్యోగుల ఉపాధికి గండి



ఎన్నికల ముందు వలంటీర్లను కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతున్నా వలంటీర్ల కొనసాగింపుపై ఖచ్చితమైన ప్రకటన లేదు. నిరుద్యోగుల ఉపాధికి గండి కొట్టారు. అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయ కక్షల పేరుతో అనేక మందిని వారు చేస్తున్న పనుల నుంచి తొలగించారు. వారిలో ఉపాధి మేట్లు, వెలుగులో పనిచేస్తున్న సిబ్బంది ఉన్నారు. వంద రోజుల్లో ఏ వర్గానికి చేసింది ఏమీ లేదు.

– రాపాక సుదీర్‌రాజ్, రంపచోడవరం

ఏ ఒక్క హామీ అమలుచేయలేదు



ప్రజలకు ఏం చేశారని వంద రోజుల పాలన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సూపర్ సిక్స్‌లో ప్రకటించిన ఒక్క హామీనైనా అమలు చేసి ప్రజల్లోకి వెళితే బాగుంటుంది. పోలవరం ముంపు బాధితుల కోసం ఏం పట్టించుకున్నారు. రైతులకు ఒక్క రూపాయి పెట్టుబడి సాయం ఇవ్వలేదు. ఏం అమలు చేయకుండా వంద రోజుల పాలన కార్యక్రమం నిర్వహిస్తున్నారో కూటమి నాయకులకే తెలియాలి. ఇప్పటి వరకు ఏ ఒక్క హామీ అమలు చేయలేదు.

–పండా కుమారి, వైస్ఎంపీపీ ,రంపచోడవరం

పేదలను వంచనకు గురిచేశారు



అధికారం కోసం అమలు చేయలేని హామీలు ఇచ్చి పేదలను వంచనకు గురి చేశారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడిచిందని సంబరాలు చేసుకుంటున్న ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పేదలకు ఇచ్చిన మాటను ముందు నిలబెట్టుకోవాలి. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్‌లు, నిరుద్యోగ భృతి వంటి ఎన్నో పథకాల కోసం పేదలు ఆశగా ఎదురు చూస్తున్నారని ఈ పాలకులు గుర్తించాలి.

– రంబాల నాగేశ్వరరావు, ఎటపాక

అభివృద్ధి జీరో



కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో అభివృద్ధి జీరో.. ఈ వంద రోజుల్లో మండల అభివృద్ధి విషయంలో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే చందాన ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి మినహా ఈ వంద రోజుల్లో కూటమి ప్రభుత్వం ఎటువంటి పనులు చేసిన దాఖాలు లేవు. చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం కొత్త కాదు. ప్రగల్భాలు తప్పా పాలనలో ఎటువంటి అభివృద్ధి కనిపించడంలేదు.

– ముర్ల జోగిరెడ్డి, సిరిమెట్ల, వై.రామవరం మండలం

ప్రకటనలతోనే సరి



కూటమి ప్రభుత్వం వంద రోజులో సంక్షేమం, అభివృద్ధి, ప్రజా సమస్యలు పరిష్కరించిన దాఖలాలు లేవు. ఈ తరుణంలో ప్రభుత్వం వంద రోజుల కార్యక్రమం జరుపుకోవడం విడ్డూరంగా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ అమలుచేయకుండా సీఎం చంద్రబాబు బూటకపు హామీలతోనే సరిపెట్టడం ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

– కడబాల ఆనందరావు, రాచపాలెం, వై.రామవరం మండలం

అబద్ధపు హామీలు



ఎన్నికల ముందు చంద్రబాబు అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కి ఆ తరువాత విస్మరించడం దారుణం. కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు కావస్తున్నా ఒక్క పథకం అమలుచేసిన దాఖలాలు లేవు. ఏ గ్రామాల్లోనూ ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. ప్రజా సమస్యలను అటకెక్కించి, ఇచ్చిన హామీలన్నీ మరిచి మోసపూరిత పాలన సాగుతోంది.

– వలాల విశ్వమ్మ, ఊలెంపాడు, వై.రామవరం మండలం

రైతులకు దగా



ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా సాయం అందలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టగానే ప్రకటించిన పథకాలన్నింటినీ సకాలంలో అందించారు. చంద్రబాబు వంద రోజుల పాలన పూర్తయినా రైతు అప్పులు చేసుకొని పనులు చేపట్టాల్సిన దుస్థితి నెలకొంది. ఇది రైతులను దగా చేసే ప్రభుత్వం.

– దీకొండ గంగాధరరావు, రైతు, కూనవరం

వరద సాయం కోసం ఎదురుచూపులు



వరదలతో విలీన మండల వాసులను కష్టకాలంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం తూతూ మంత్రంగానే సహాయక చర్యలు చేపట్టింది. మూడు దఫాలుగా వచ్చిన వరదలకు ఇళ్లన్నీ దెబ్బతిన్నాయి. లక్షల్లో నష్టం జరిగింది. ప్రభుత్వ సాయం అటకెక్కింది. బాధితులకు కన్నీళ్లే మిగిలాయి. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో దగా పాలన సాగిస్తోంది. విలీన మండలాల్లో ఒక్క అభివృద్ధి పని చేయలేదు. ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

– పాయం రంగమ్మ, ఎంపీపీ, కూనవరం

క్రీడలతో మానసిక ఉల్లాసం



ఎటపాకలో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో రాజులు



అరకులోయలో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు



ముంచంగిపుట్టులో పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి



పెదబయలులో ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఏటీడబ్ల్యూవో స్వర్ణలత, ఎంఈవో పుష్ప

ఎటపాక: నల్లకుంట ఆశ్రమ పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈవో సరియం రాజులు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. మండల స్థాయిలో గెలిచిన విద్యార్థులు ఈనెల 23, 24 తేదీల్లో రంపచోడవరంలో జరగనున్న నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ఇచ్చారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: స్థానిక ప్రభుత్వ క్రీడా పాఠశాల మైదానంలో మండలస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ మండల సెక్రటరీ పి.సూరిబాబు మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులు ఈనెల 23న జరిగే నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్, రామరాజు, అప్పారావు, కొండలస్వామి, శ్రీను, నారాయణమ్మ పర్యవేక్షించారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని పాఠశాలల్లో జరుగుతున్న క్రీడా పోటీలను ఎంఈవో కృష్ణమూర్తి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. హెచ్‌ఎం మాణిక్యాలరావు, తిరుపతిరావు, సుబ్బారావు, రామారావు, రాధాకృష్ణ, అనంతరావు పాల్గొన్నారు.

పెదబయలు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను ఏటీడబ్ల్యూవో స్వర్ణలత, ఎంఈవో పుష్ప శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు చాలా ముఖ్యమన్నారు. ఆటల వల్ల మంచి ఆరోగ్యం లభిస్తోందని, చదువులో కూడా చురుకుదనం పెరుగుతుందన్నారు. పలు క్రీడల్లో గెలిచిన వారు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు ప్రకటించారు. హెచ్‌ఎంలు కృష్ణమూర్తి, చిట్టమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పార్లు గ్రామంలో అవగాహన కల్పిస్తున్న సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మి

హుకుంపేట: మండలంలోని కామయ్యపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జరిగిన పౌష్టికాహార మాసోత్సవాల కార్యక్రమంలో సర్పంచ్ పాంగి బేసు, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కొర్ర నాగరాజు తదితరులు మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, రోజువారీ ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం సామూహిక సీమంతం కార్యక్రమంలో గర్భిణులకు పండ్లు, ఆహార పదార్థాలు తదితర సామగ్రి అందజేశారు.

జి.మాడుగుల: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా సింగర్బ సెక్టార్ పరిధిలో పార్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి పోషణ్ అభియాన్, బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సత్యవతి, పద్మావతి, లక్ష్మి, మణికుమారి, ప్రథమ సంస్థ ప్రతినిధి తిరుపతిరావు పాల్గొన్నారు.

త్వరితగతిన కల్వర్టు పనులు చేయించాలి



పాడైన కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్య తదితరులు

చింతపల్లి: బలపం పంచాయతీ గిల్లెలబంద, చెరువూరు, తడపల్లిలో కొట్టుకుపోయిన కల్వర్టుల త్వరితగతిన నిర్మించాలని ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య కోరారు. సర్పంచ్ కొర్రా రమేష్‌తో కలిసి శుక్రవారం వారు పంచాయతీల్లో పలు గ్రామాలను సందర్శించారు. ఇటీవల తుపానుకు దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, వంతెనలు, పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారులు దెబ్బతినడంతో అత్యవసర సేవలు అందే పరిస్థితి లేదని , దీంతో రోగులను డోలీమోతపై ఆస్పత్రులకు తరలించే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కోరుకొండ–బూరుగుబయలు గ్రామాల మధ్య కాలువపై కల్వర్టును ఏర్పాటు చేయాలన్నారు. చెరువూరు– గల్లెలబంద మధ్య ఉన్న కల్వర్టు కొట్టుకుపోవడంతో ఎనిమిది గ్రామాలకు రాకపోకలు సాగించడం కష్టంగా మారిందన్నారు. లోతుగెడ్డ వంతెన నుంచి మూలగరువు వరకు ఉన్న రోడ్డు పూర్తిగా పాడైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి దెబ్బతిన్న రహదారి, కల్వర్టు, వంతెన నిర్మాణ పనులను త్వరగా చేయించాలని డిమాండ్ చేశారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు డి.పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబూరావు, మోహన్ పాల్గొన్నారు.

వివాహాలకు లైసెన్స్ మంజూరు

అడ్డతీగల: మండలంలోని క్రిస్టియన్ వివాహాలు చేసేందుకు ప్రభుత్వం లైసెన్స్ మంజూరు చేసినట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపినట్టు మేడిది రాజేష్ తెలిపారు. భీముడుపాకలలో ఆంధ్ర ఇవాలాంజికల్ లూథరన్ చర్చ్ నిర్వాహకుడు రాజేష్‌కు మంజూరు చేసిన ఈ లైసెన్స్ మూడేళ్లు అనుమతి ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది.

కుష్టు వ్యాధిపై అవగాహన

జి.మాడుగుల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర లెప్రసీ టీమ్ (స్కేప్ టీమ్)సభ్యులు డీపీఎంవో కార్డియాలజీ డాక్టర్ వై.బి.నాయుడు, కార్డియాలజీస్టులు డాక్టర్ ఎస్.ఎస్.మూర్తి, డాక్టర్ బెంజిమెన్ సందర్శించారు. అనుమానిత లెప్రసీ కేసులను వారు పరిశీలించారు. జి.మాడుగుల పీహెచ్‌సీ పరిధిలో గల 9సచివాలయాల పరిధిలో గల పలు గ్రామాల్లో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. పలువురికీ పరీక్షలు చేశారు. ఎవరీ లెప్రసీ లేదని, సాధారణ మచ్చలుగా నిర్ధారించి, ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీహెచ్‌వీవో నడిగట్ల ప్రకాష్, హెల్త్ సూపర్‌వైజర్ సంజీవ్‌పాత్రుడు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ

కొయ్యూరు: సింగవరం రైతు భరోసా కేంద్రంలో బూదరాళ్ల, మర్రివాడ పంచాయతీలకు చెందిన రైతులకు రాజ్‌మా విత్తనాలను ఎంపీపీ బడుగు రమేష్ శుక్రవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాజ్‌మా పండించి రైతులు లాభాలు పొందవచ్చన్నారు. ఏవో ఉమాదేవి మాట్లాడుతూ 90 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు వచ్చాయన్నారు. బూదరాళ్ల, మర్రివాడ రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు.వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, నాయకులు చంద్రరావు, నారాయణ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలి



అక్రమంగా నిర్మాణం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

పాడేరు : జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో రోజు రోజుకు గిరిజనేతరుల అక్రమ నిర్మాణాలు హెచ్చుమీతున్నాయని, అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై అధికారులు తక్షణమే ఎల్టీఆర్ కేసులు నమోదు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన్నపడాల్, ప్రధాన కార్యదర్శి పొద్దు బాల్‌దేవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాల వద్దకు వెళ్లి నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మట్లాడుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులు కేసులు నమోదు చేయాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారుల అండదండతోనే అక్రమ నిర్మాణాలు హెచ్చుమీరుతున్నట్టు ఆరోపించారు. గిరిజనేతరుల అక్రమ కట్టడాలపై సమగ్ర సర్వే చేసి కూల్చివేయాలన్నారు. పట్టణంలోని మోదకొండమ్మ గుడి కింద వీధిలో షేక్ పీర్ అనే గిరిజనేతరుడు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి బహుళ అంతస్తుల భవనం నిర్మాణం జరుగుతుందని, అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. సుందర్‌రావు, చిట్టిబాబు, బొజ్జన్న, అప్పలకొండ, లింగమూర్తి, అనంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



ఎస్‌ఐలను సన్మానిస్తున్న సీఐ వెంకటరమణ, ఎంపీపీ రమేష్ తదితరులు

కొయ్యూరు: మండలంలోని మంప ఎస్‌ఐగా లోకేష్, కొయ్యూరు ఎస్‌ఐగా రాజారావు, మంప అదనపు ఎస్‌ఐగా బి.దేముడు విధులు నిర్వహించి గిరిజనులకు ఎనలేని సేవలు అందించారని ఎంపీపీ బడుగు రమేష్ అభినందించారు. బదిలీల్లో భాగంగా కొయ్యూరు ఎస్‌ఐను నర్సీపట్నం రూరల్ స్టేషన్‌కు, మంప ఎస్‌ఐను విజయనగరంలో బూదరాళ్లవలస స్టేషన్లకు బదిలీ చేశారు. ఇందులో భాగంగా బదిలీలతో పాటు పదవీ విరమణ చేసిన హెచ్‌సీ మూర్తిలకు కొయ్యూరు పోలీసుస్టేషన్ ఆవరణలో శుక్రవారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. మండలంలోని ఎస్‌ఐలుగా పనిచేసిన లోకేష్, రాజారావు, దేముడు గిరిజనులకు అనేక అంశాలపై చైతన్యం కల్పించారన్నారు. గిరిజనుల్లో పరివర్తన తీసుకురావడంలో విశేష కృషి చేశారని కొనియాడారు. వారి సేవలను గిరిజనులు కలకాలం గుర్తించుకుంటారన్నారు. అనంతరం ఎస్‌ఐలు లోకేష్, రాజారావు, దేముడు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి నడయాడిన ప్రాంతంలో గిరిజనులతో మమేకమై పనిచేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. సీఐ వెంకటరమణ, వైస్ ఎంపీపీ అప్పన వెంకటరమణ, మాజీ ఎంపీపీ గొలిసింగి సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్మూర్తి, సర్పంచ్ పీటా సింహాచలం, నేతలు పాల్గొన్నారు.